స్నేహితుడు
చెప్పిన కలలన్నీ
విన్న అతనికి
తెలిసిన
భయంకర నిజం!

గంటి రమాదేవి
కథ

# ఐయామ్ నాట్ థర్టీనైన్

జయరాం నాకేసి విచిత్రంగా చూసి అన్నాడు.

"ఎన్నాళ్ళనుంచి వస్తోంది నీకీ కల?"

"కలకాదు. కలలు నిద్రలో వస్తాయి. నాకు కన్ను తెరిచినా మూసినా అదే దృశ్యం..." చెప్పాను.

జయరాం పెన్ను స్టాండ్‌లో నుంచి జమ్స్‌క్లిప్ తీసి దాన్ని వంకర తీస్తూ అన్నాడు.

"కల కాకపోతే నీకా దృశ్యం ఎలా కనపడుతోంది?"

జయరాం పూర్తిపేరు జయరాందత్. మేమిద్దరం ఒకే ఆఫీసులో జూనియర్ లెవల్స్‌లో పనిచేస్తూ వుండేవాళ్ళం. అప్పుడు చాలా బీదగా వుండేవాడు. అప్పుడే చిన్నతరహా పరిశ్రమ స్థాపించాడు. వేరే ఎక్కడో కాదు ఇంట్లోనే. బట్టల సబ్బులు, పౌడర్లు తయారుచేసేవాడు. వాటి పేర్లు తమాషాగా వుండేవి. సబ్బు పేరు 'నేస్టీ డ్రెస్'. పౌడర్ పేరు 'డర్టీ లినన్'. ఆఫీసులోనే చాలామటుకు అమ్మేవాడు.

క్రమంగా గవర్నమెంట్ ఆఫీసులో అతని 'నేస్టీ డ్రస్' సబ్బులకు గిరాకీ పెరిగింది. 'డర్టీ లినన్' మెల్లగా పికప్ అయి, సేల్సు, సబ్బులను మించిపోయింది.

అది పదేళ్ళ నాటి మాట.

ఇప్పుడతను డిటర్జంట్స్ తయారుచేసే ఫ్యాక్టరీ యజమాని.

"ఉన్నట్టుండి మైకం కమ్ముతుంది ఒక అర నిమిషంపాటు. అప్పుడు ఆ మైకంలో పదేపదే ఆ దృశ్యం నా కళ్ళముందు



కనపడుతుంది. నేను చాలా వర్రీడ్‌గా వున్నాను..." అన్నాను.

"అది సరే. నీ ఫారిన్ ఎసైన్‌మెంట్ ఏమయింది?"

"పదిహేడో తారీకున అక్కడ చేరాలి..."

"బొంబాయి ఎప్పుడెళుతున్నావు?"

"పధ్నాలుగో తారీకు మధ్యాహ్నం ఫ్లయిట్‌కు బుక్ చేసుకున్నాను. ఆ రాత్రి

'సహార్' ఎయిర్‌పోర్టులో ఫ్రాంక్‌ఫర్ట్ విమానం ఎక్కాలి...''

''గుమస్తాగా తృప్తిపడక పై చదువు చదవడం కంప్యూటర్స్ కోర్సు చేయడం మంచిదయింది. జర్మనీలో ఈ వుద్యోగం, పదేళ్ళ క్రితం వ్యూహకయినా అందనిది...''

'జమ్‌క్లిప్' జయరాం చేతిలో తీగలా సాగింది. దాన్నతను మరలా క్లిప్‌లా చేయాలని ప్రయత్నిస్తున్నాడు.

జయరాందత్ అతని పూర్తి పేరు. ఇంటిపేరు తాతా. మార్కెట్‌లో అతనికి మంచి పేరుండడానికి తాతా జయరాం దత్ అన్న పేరులో ఇమిడివున్న రెపుటేషన్ ఉపయోగపడింది. షార్ట్‌గా తన పేరును జె.ఆర్.డి.తాతాగా మార్చుకున్నాడు. లీగల్‌గా ఏదో సమస్య వచ్చిందని విన్నాను. అది సాల్వ్ అయింది. తాతావాళ్ళు చాలామంది గోదావరి జిల్లాలలో వున్నట్టు ప్రూవ్ చేశాడు.

''అది సరే. ఆ ఆనందం కన్నా ఈ నరకం ఎక్కువ బాధ పెడుతోంది. అదే ఫారిన్ ఉద్యోగం...''

''నేనూ బొంబాయి రావాలి. నేను ప్రొద్దుట ఫ్లయిట్‌లో వెళ్ళాలి. నువ్వూ మార్చుకోకూడదూ?''

''ఎలా బుక్ అయిపోయింది— మార్చమంటే మారుస్తారా...''

''నీ టికెట్టు నాకు పంపించు. నా ఆఫీస్ స్టాఫ్‌ను పంపించి నీ ఫ్లయిట్ ఉదయానికి మార్పిస్తాం...''

జేబులో వున్న టికెట్టు జయరాంకిచ్చాను. జయరాం నవ్వుతూ అన్నాడు.

''టికెట్టు జేబులో పెట్టుకు తిరుగుతున్నావా?''

నేను సిగ్గుపడి అన్నాను.

''ఇది నా మొదటి విమాన ప్రయాణం ...''

ఆ ఇప్పుడు చెప్పు వివరంగా నీ కల సంగతి— సారీ— నీకు— మెలకువలోనే కనపడే ఆ దృశ్యం సంగతి...'' జయరాం అన్నాడు.

నా కళ్ళముందు ఆ భయంకర దృశ్యం కనపడింది. వివరంగా చెప్పడం మొదలుపెట్టాను.

చిక్కటి చిమ్మ చీకటిలాంటి సముద్రం అంటూ లేకుండా ప్రశాంతంగా వుంది. ఆ సముద్ర ఉపరితలం చల్లగా వుంది మంచునీరులా. నేను కుర్చీలో కూర్చుని వున్నట్టు నీటిమీద కూర్చుని వున్నాను. ముందు నిశ్చలంగా వున్న సముద్రంలో చిన్న కదలిక. కందిరీగల రొదలా సన్నటి రోదనా స్వరం. రానురాను సముద్రపు ఉపరితలం అత్యంత వేగంగా నా క్రింద కదిలిపోతూ వుంది. చిన్నగావున్న కందిరీగల రొద ఉరుముల ధ్వనిగా మారిపోయింది.

కొంతదూరం అలా పోయిన తర్వాత సముద్రం మధ్యలో ఒక మిల్లు కనపడింది. నా ప్రయత్నం లేకుండానే నేనా మిల్లులో ప్రవేశించాను. రణగొణ ధ్వనులతో ఆ ప్రదేశం అంతా నిండిపోయింది.

అది రైస్‌మిల్ అయి వుంటుందని నేననుకుంటున్నాను. దానికి ఒక కారణం వుంది. నేను ఆ మిల్‌లో ప్రవేశించిన

కొంతసేపటికి హఠాత్తుగా పెద్ద పెద్దమంటలు ఆ ప్రదేశమంతా చెలరేగాయి. రైస్‌మిల్లు వెనుక ఆవరణలో గుట్ట గుట్టలు వూక పారబోస్తారు. చిన్న అగ్గిరవ్వ తగిలినా అవి అంటుకుని ప్రమాదాలను సృష్టిస్తాయి. రైస్‌ మిల్లు కాకుండా వేరే ఏదైనా మిల్లు కూడా కావచ్చు.

అంత పెద్ద ఫ్యాక్టరీలాటి ఆ మిల్లులో నరసంచారం లేదు మిషన్ల గోల తప్ప, మనిషి అలికిడి లేదు. చెలరేగుతున్న మంటలలో నిస్సహాయంగా నేనొక్కడినే.

నాకు భయం వేసింది. మిల్లు లోపలనుండి బయటకు వచ్చాను. మంటల వేడి తాళలేక సముద్రంలో దూకేయాలనుకున్నాను. ఇరవై అడుగుల క్రింద ఎక్కడో వుంది సముద్రం. చీకటిలో స్పష్టంగా తెలియడం లేదు. దూకడానికి సంకోచించినా, వేడెక్కుతున్న మంటల తాకిడికి తట్టుకోలేక దూకేయాలనుకున్నాను. నా కాలు కదలలేదు.

నా దృష్టి కదలని నా పాదాలపై పడింది.

అప్పుడు చూశాను.

భయంతో నా వెన్ను జలదరించింది.

నా పాదాలను చెద పురుగులు తినేస్తున్నాయి!

మోకాలి వరకు మాంసాన్ని అవి తినేశాయి!

నెమ్మదిగా అవి కదులుతున్నాయి ముందుకు!

కొన్ని వందలు— వేలు— కొన్నివందల వేలు!!!

ఎముకలు మాత్రం మిగిల్చి తినేస్తున్నాయి!

అప్పుడు నాకు మెలకువ వస్తుంది.

భయంతో తడారిపోయిన నా గొంతు నీళ్ళకోసం పరితపిస్తుంది. అప్పుడు తాగిన నీరు అమృతంలా వుంటుంది''

నేను అధిక ప్రసంగం చేస్తున్నానని అనిపించిందేమో, జయరాం, అడ్డుకుని అన్నాడు.

## మందు!



డాక్టర్‌ని నీరసంగా అడిగాడు పేషెంట్.

''ఈ మందులన్నీ వాడాక ఏం చెయ్యమంటారు డాక్టర్‌గారూ...?''

''అప్పటివరకు బ్రతికుంటే చెప్తాలే...''

''ఆ...!''

—యం.డి.రియాజ్ పాషా (సామర్లకోట)

"ఆ మిల్లు— అదే నీ వ్యూహాగానం ప్రకారం రైస్‌మిల్— పేరేమిటో చూసావా!"

ఆలోచించి అన్నాను.

"పేరు చూసిన గుర్తులేదు. మంటలు మాత్రం తిరగేసిన 'J' ఆకారంలో వున్నట్టుగా నాకు అనిపించింది"

"నీ కల గురించి— సారీ— దృశ్యం గురించి— సైక్రియాట్రిస్ట్‌ను సంప్రదిస్తే...."

"వద్దు నా ప్రయాణం దగ్గరికి వచ్చింది అయినా నేను శారీరకంగా బాగానే వున్నాను. సైకియాట్రిస్టు దగ్గరకు వెళితే కోతిపుందు బ్రహ్మరాక్షసి అయినట్టు అవుతుందేమో! ఈ సంగతి నా ఫ్యూచర్ ఎంప్లాయర్‌కు తెలిస్తే నా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ కాన్సిల్ చేసినా చెయ్యచ్చు..."

జయరాం ఆలోచిస్తూ అన్నాడు.

"నీ కల గురించి నాకో అవగాహన కలుగుతోంది. కాని చెద పురుగులు నీ కాళ్ళను దొలచడమే అర్థం కావడం లేదు"

"విమానంలో ప్రయాణించడం నాకిదే మొదటిసారి. ముందు భయపడ్డాను. నువ్వు వుంటావుగా— ఇక భయంలేదు" అన్నాను.

"సరే— ఎక్కువ ఆలోచనలు పెట్టుకోకు. ఇక ఆ దృశ్యాలు కనపడవులే—" జయరాం అన్నారు.

కాని 'అవి' కనపడటం ఎక్కువయ్యాయి.

ఇంకో సంగతి!

తగలపడిపోతున్న ఆ మిల్లుమీద అక్షరాలు ఇప్పుడు తెలుస్తున్నాయి.

అవి 'J.R.D'

* * *

ఆరోజు ప్రయాణం!

చాలా టెన్షన్‌గా వుంది.

మొదటి విమాన ప్రయాణం!!

రాత్రంతా నిద్రపట్టలేదు.

నిద్రపట్టిన కాసేపు ఏవో కలలు!

టైము అయిపోతుందేమోనన్న భయంతో వులికి వులికి పడుతున్నాను.

తెల్లవారుజామున నాలుగు గంటలకే తయారయ్యాను.

సామాను తీసుకుని ఆటో ఎక్కాను.

నా భార్యాపిల్లలు ఎవరూ వీడ్కోలు ఇవ్వలేదు. దేశం విడిచి పెట్టి వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఎప్పుడొస్తానో తెలియదు— కాని వీళ్ళకేం బాధ వున్నట్టు లేదు.

ఎవరో అన్నట్టు 'గుంపులో ప్రయాణం చేసినా నువ్వు వంటరివాడివే. గుంపు కరిగిపోతుంది. నీవొక్కడివే మిగిలిపోతావ్!' అని.

ఆటో ఎయిర్‌పోర్టు సమీపించింది.

నేనొక్కడినే దిగినట్టున్నాను. ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో ఎవరూ లేరు.

చీకటిగా వుంది లోపల.

గుడ్డిగా ఒకే దీపం వెలుగుతోంది.

Bombay అన్న అక్షరాలు సగం సగం కనిపిస్తున్నాయి.

జయరాం ఇంకా రాలేదు.

అక్కడ దగ్గర్లో వున్న కుర్చీలో కూర్చున్నాను.

ఎయిర్‌పోర్టులో చీమ చిటుక్కుమన్న శబ్దం కూడా కావడం లేదు.

ఎయిర్‌పోర్టు ఇలాగే వుంటుందా?

అరగంట గడిచిపోయింది.

నా కాళ్లదగ్గర ఏదో అలికిడి.

క్రింద చూసి వులిక్కిపడ్డాను.

చెద పురుగులు. నా 'దృశ్యం'లో కనపడ్డట్టే.

కుర్చీని సగం తినేశాయి.

లేచి నిలుచున్నాను. నా కాలిమీద కొన్ని పురుగులు ఉన్నాయి. విసురుగా వాటిని విదిల్చాను.

Bombay అన్న కౌంటర్ దగ్గరకు వెళ్లాను.

ముఖాలు కనపడకుండా చీకటి.

లీలగా ఎవరో అక్కడ వున్నట్టు తెలుస్తోంది.

జేబులోనుంచి తీసి టిక్కెట్టు ఇచ్చాను.

"ముప్పై తొమ్మిది—" అన్న మాటలు గుసగుసగా నా చెవిలో వినపడింది.

"ఏమిటి ముప్పై తొమ్మిది—" అన్నాను ఆ శబ్దం వినిపించినవైపు.

అక్కడ నాకెవరూ కనపడలేదు.

బోర్డింగ్ కార్డు నా చేతికిచ్చాడు కౌంటర్లో వ్యక్తి. సూటుకేసు తీసుకుని Security Check అని వ్రాసున్న వైపు నడిచాను.

అక్కడా నేనొక్కడికినే... ఏమీ కనపడకుండా చీకటి.

అయోమయంగా చూస్తున్న నాకు "ముందుకెళ్ళు" అన్న మాటలు ఎక్కడనుంచో వినపడుతున్నాయి.

అలాగే చేశాను.

కాకీ యూనిఫాంలో పోలీసు. ముఖం కనపడకుండా టోపీ.

"ఇంత చీకటిగా వుంది. కరెంటు పోయిందా?"

"......."

"ఎవరూ లేరు... పాసింజర్ని నేనొక్కడినే"

"ముప్పై తొమ్మిది—"



## విలువ

ఈ మధ్య కేరళలో భిక్షగాళ్ళు కూడా సమ్మె చేసారండోయ్. ఒకవారం రోజులు ఏమీ తినకుండా, త్రాగకుండా చేతిలో బేనర్‌తో వారి కోరిక ఏమంటే 'వారికేసే ధర్మం కనీసం ఒక రూపాయి అన్నా వుండాలని. ప్చ్. రూపాయికి ఉల్లిపాయకున్నంత వాల్యూ కూడా లేదన్నమాట.

అమ్మయు.వి. రాజ్యశ్రీ

అప్పుడర్థమయింది. ముప్పై ఎనిమిదిమ ంది నా కన్నాముందే వచ్చేసారన్నమాట.

ముందుకు నడిచాను.

మసగ వెలుతురు. హాలంతా చాక్ లెట్ కలర్ కుర్చీలు నల్లగా, ముసుగేసుకున్న దయ్యాల్లా కనపడుతున్నాయి.

అద్దాలగుండా కనిపిస్తోంది. నిలబడి వున్న విమానం.

ఆకలి మీదున్న బ్రహ్మరాక్షసిలా వుంది అది.

సూట్ కేసు తీసుకుని ముందుకు వెళ్ళా ను.

ముప్పై ఎనిమిది మందిలో ఒక్కడూ కనపడలేదు.

అందరూ ఎక్కేశారా?

లేడర్ మీదుగా నడిచి విమానంలోపల ప్రవేశించాను.

లోపల లైట్లు లేవు.

ఖాళీగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

చుట్టూ తేరిపార చూశాను.

"ముప్పై తొమ్మిది—" నా చెవిలో ఎవరో గొణిగారు.

"ఏంటి ముప్పై తొమ్మిది—" అన్నాను గట్టిగా.

కోపం వస్తూ వుంది.

నా మొదటి విమాన ప్రయాణం ఇంత అధ్వాన్నంగా వుంటుందనుకోలేదు.

"బలి—" అంది గుసగుసగా ఆ గొంతు.

"బలా— నేనున్నది అమ్మవారి గుడా? విమానమా?"

"ఇది ఇవాళ కావాలన్న బలి?"

అసహజమైన ఆ వాతావరణం నాకు భయాన్ని కలగజేసింది.

"నేను దిగిపోతాను..." లేవబోయాను కంగారుగా.

బలంగా నా భుజాలు నొక్కుతూ అంది ఆ స్వరం. నవ్వుతోంది.

"ఒక్కసారి ఇక్కడికి వస్తే ఇక తిరిగి వెళ్ళడం వుండదు—"

సీటులో బిగుసుకుపోయాను.

నా కింద భూమి కదిలినట్టయింది.

కందిరీగల జోరులా శబ్దం.

నెమ్మదిగా కదులుతున్న భూమి వేగం పెరిగింది.

పిడుగుపాటు శబ్దాలు— ఆ తర్వాత.

కొన్ని క్షణాలు... కిటికీలోనుంచి చూస్తు న్నాను.

ఆకాశంలో చందమామ కనిపిస్తోంది ఇప్పుడు.

ఇది 'ఘోస్ట్ ఫ్లయిట్' కాదు కదా.

తర్వాత—

ఎర్రగా, ఆరెంజి రంగులో— నీలం రంగులో మంటలు— తిరగబడ్డ J ఆకారం లో. నాలుకలు చాస్తూ నన్ను తమ లోపలకు లాక్కోవాలని ప్రయత్నిస్తూ మంటలు.

అచ్చు ఆ దృశ్యంలో చూసినట్టు!

ఆ రైస్‌మిల్లు ఏదీ?

ఏదో పేలుతున్న శబ్దం.

"నువ్వే ముప్పై తొమ్మిది—"

కీచుగా మాటలు వినిపించాయి. అంతర్గ తంగా పైశాచిక ఆనందం ఆ మాటల్లో ధ్వనిస్తోంది.

గబుక్కున లేవబోయాను.

లేవలేకపోయాను.

చెదపురుగులు కాదు.

ప్లాస్టిక్ కరిగి నా నడుము వరకు గడ్డ కట్టింది.

నాకు వేడి అనిపించకుండా ప్లాస్టిక్ ఎలా కరిగింది.

హఠాత్తుగా నా ముఖాన్ని కాల్చేస్తూ వుంది మంట.

కెవ్వున అరిచాను.

* * *

ఎవరో నన్ను పట్టి కుదుపుతున్నారు.

"ఎందుకలా అరుస్తున్నారు. లేవండి. తయారవండి. వేళవుతోంది—"

నా భార్య గట్టిగా అంటోంది.

నిజం అనిపించే కల! కలలో కూడా ఇది కల కాదు అనిపింపజేసే కల!

గబుక్కున లేచాను.

ఆరుంపావయింది.

ఆరు ముప్పై అయిదుకే విమానం.

"నన్నెందుకు లేపలేదు— ఇప్పుడు విమానం టైమయింది?"

"మధ్యాహ్నం పదకొండుకు కదా?" నా భార్య అంది. పొరపాటు నాదే.

జయరాం నా ఫ్లయిట్ ఉదయానికి మార్చినట్టు చెప్పలేదు.

ఆఘమేఘాలమీద తయారయ్యాను.

ఆటోలో విమానా(శయం చేరుకున్నాను.

ఇసుకవేస్తే రాలనంత జనం.


టైము అయిదు నిమిషాల తక్కువ ఏడు!

కౌంటర్ మూతపడింది.

యూనిఫాంలో వున్న ఒకతనితో అన్నాను.

"సార్ ఆరున్నర ఫ్లయిట్‌లో నేను బొంబాయి వెళ్లాలి—" నా గొంతులో కంగారు స్పష్టంగా తెలుస్తోంది.

"ఇట్ హాజ్ లెఫ్ట్ ఆల్ రెడీ—" అన్నాడతను.



''గాడ్! జయరాం వెళ్ళాడా?'' అడిగాను.

''ఆల్ హోప్ గాన్—'' నిర్లక్ష్యంగా అన్నాడతను.

ఉసూరుమంటూ ఇల్లు చేరాను.

పదకొండు గంటలకు గాని విమానం లేదు.

ఈ టిక్కెట్టు వప్పుకుంటారా?

అడగడం మర్చిపోయాను.

నా విదేశీ ప్రయాణం మొదట్లోనే ఇలా ఏడ్చిందే!

నా గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాను.

నా మనసు వికలంగా వుంది—

ఇప్పుడే కాదు—

చాలా రోజులుగా—

ఆలోచిస్తూ కూచుండిపోయాను.

మళ్ళీ టికెట్టు కొనాలి. మిస్ అయిన విమానపు టికెట్టు పైసలు పోయినట్టే—

నా పక్కన ఎవరో కూర్చున్నట్టనిపించి అటు తిరిగి చూశాను.

ఆశ్చర్యం!

జయరాం!!

''హమ్మయ్యా! బతికాను. నువ్వూ వెళ్ళ లేదన్నమాట. రాత్రి ఒక భయంకరమైన కల. విమానంలో నేనొక్కడినే. మాటికి మాటికి ఎవరో 'ముప్పై తొమ్మిది' అనడం మొదలుపెట్టారు'' అన్నాను రిలీఫ్‌గా ఫీలవుతూ.

''నా కిప్పుడు నీ దృశ్యం చాలాకు అర్థం తెలిసిపోయింది'' అన్నాడు జయరాం.

''రాత్రి తట్టిందా?''

జయరాం చెప్పడం మొదలుపెట్టాడు.

''చిమ్మచీకటిలాంటి సముద్రం ఆకాశం. నీరు చల్లగా వుందంటే అది విమానంలోని ఎ.సి. ఎఫెక్ట్— అంటే నువ్వు విమానంలో ప్రయాణం చేస్తున్నావన్నమాట. కందిరీగల ధ్వని; ఇంజన్ స్టార్ట్ చేసినప్పుడు వచ్చేది. పిడుగుపాటు శబ్దం, ఇంజన్ పూర్తిస్థాయి రొటేషన్...''

''మరి రైస్‌మిల్లు?''

''అది రైస్‌మిల్లు కాదు. అది విమానపు ఇంజన్ల హోరు. నీకు ఇదివరలో విమానం ఎక్కిన అలవాటు లేదు. నీకు తెలిసిన అనుభవానికి తగినట్టుగా ఈ ఎయిర్‌ప్లేను శబ్దాన్ని రైస్‌మిల్లుకు అన్వయించుకున్నావ్?'

''మరి మంటలు—''

జయరాం చెప్పిన ఆ తర్వాత మాట విని నేను మంచులా బిగిసిపోయాను.

''అవి విమానంలోని మంటలు. ఇంజన్‌కు నిప్పు అంటుకుని లేచిన మంటలు''

''మైగాడ్! హిద్దుటి విమానంలో అగ్నిప్రమాదం... మన లక్ బాగుండి మనం దానిలో వెళ్ళలేదు—''

''మన లక్ అనకు—'' అన్నాడు జయరాం అదోరకంగా.

''అదేమిటి?''

''మంటలు ఏ అక్షరాన్ని పోలి వున్నాయి?''

''తిరగేసిన J.

''రైస్‌మిల్ మీద అక్షరాలు''

''J.R.D. అయితే—''

''అది నేనే— J.R.D. జయరాం

దత్''

అతను చెప్పినది అర్థమై నా శరీరం భీతితో సుడిగాలిలో ఎండుటాకులా వణికిపోయింది...

''నువ్వు''

''ఉదయం ఆ విమానంలో నేను ఎక్కాను''

గాలిలో కరిగిపోతూ జయరాం అన్న చివరి మాటలు నన్ను దిగ్భ్రాంతిలో ముంచేశాయి.

దఢాల్న తలుపు తీసి బయటికి వచ్చాను. టీ.వీలో ఇంగ్లీష్ న్యూస్.

''ఇన్ ఎ వర్స్ట్ ఎయిర్ డిసాస్టర్, థర్టీ ఎయిట్ ప్యూపుల్ ఆర్ వార్డు టు డెత్, వైల్ అదర్ ఫార్టీఫోర్ ఆర్ ఇన్ క్రిటికల్ కండిషన్—''

నిస్త్రాణగా నేను కుర్చీలో కూర్చుండిపోయాను.

నా కాళ్ళు చెదపురుగులు తింటున్న అనుభూతి.

దీనర్థం తెలిసిపోయింది—

నేనెక్కడికీ వెళ్ళలేను.

విదేశీ ప్రయాణమే కాదు— విమాన ప్రయాణం కూడా—

ఐయామ్ నాట్ థర్టీనైన్.

*



## వేరుశెనగ కథ

వేరు శెనక్కాయల వెనకాలొక కథ ఉంది. దక్షిణ అమెరికాలోని ఇండియన్స్ (రెడ్ ఇండియన్లు) 2వేల సంవత్సరాల్కితమే ఈ వేరు సెనగని పండించేవారు. ''ఇన్‌కా సమాధి'' త్రవ్వకాలలో వేరుశెనగకాయ ఆకారంలో ఉన్న మట్టి పాత్రలు దొరికాయి. స్పెయిన్ దేశస్థులు వీటిని యూరప్ ఖండంలో ప్రవేశపెట్టారు. అలా వేరుశెనగలు ఆఫ్రికా, ఆసియాద్వారా ఇండియాలోకి ప్రవేశించాయి. బానిస వర్తకులు ఈ వేరుశెనగల్ని ఆహారంగా ఇచ్చి బానిసల్ని బాగా బలిసేట్లుచేసి మంచి ధరకు అమ్మేసేవారు. ఈ బానిసల ద్వారా ఉత్తరమెరికాకి వేరుశెనగ వెళ్ళింది. 1890లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని ఒక డాక్టరు ఈ గింజల్ని మెత్తగా పేస్టులాగా చేసి ''గ్రౌండ్ నెట్ బట్టర్'' తయారు చేశాడు. అది బాగా ప్రచారం పొందింది. జార్జ్ ఎన్.కార్వర్ అనే నీగ్రో (బానిస) సైంటిస్ట్ రీసెర్చ్ చేసి వేరుశెనగనుండి 300 రకాల వస్తువుల్ని ఉత్పత్తి చేయవచ్చని కనుగొన్నాడు. ఇది ఇప్పుడు షాంపూ, సబ్బుల్లో కూడా వాడబడ్తోంది. ఇది బీన్స్, చిక్కుడు జాతికి చెందింది. పసుపు పచ్చపూలు పూస్తుంది. ఇవి కిందికి వాలి భూమిలో కాయలుగా మారుతాయి.

—అమ్ముతుని రాజశ్రీ